

బదిలీల్లో ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి - రాయచోటి

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయులకు త్వరలో నిర్వహించబోయే బదిలీల్లో అదనపు పాయింట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కడప జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కబ్ మాస్టర్స్ సోమవారం స్కౌట్స్ స్టేట్ కమిషనర్ ప్రతాపరెడ్డికి విజయవాడలో వినతి పత్రం అందజేశారు. బదిలీల్లో అదనపు పాయింట్లు కేటాయించడం ద్వారా జిల్లా సెక్రటరీలకు జిల్లా కేంద్రాల్లో గాని, జిల్లా కేంద్రాలకు సమీపంలో ఉన్న పాఠశాలల్లో పనిచేసే అవకాశం కల్పిస్తే స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను నిర్వహించే కబ్ మాస్టర్స్, స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్లకు ప్రాధాన్యత ఇస్తూ అదే పాఠశాలలో కొనసాగేలా చూడాలని లేని పక్షంలో స్కౌట్ యూనిట్ ఉన్న పాఠశాలకు బదిలీ చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో పెజార్టియు రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ కొండూరు శ్రీనివాస్ రాజు, కబ్ మాస్టర్స్ చంద్రశేఖర్, భూపతి, ఈశ్వరయ్య, హరినాథ్ పాల్గొన్నారు.

భవనాలు తొలగించడం అన్యాయం : సిపిఎం



జెసిబితో కూల్చుతున్న పేదల భవనాలు

ప్రజాశక్తి-కురబలకోట

మండలంలోని కడప క్రాస్‌లో నేషనల్ హైవేకి భవనాలు, దుకాణాలు అడ్డంగా ఉన్నాయని నిర్దాక్షిణ్యంగా జెసిబిలతో తొలగించడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం ఆక్రమణల తొలగింపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు, పోలీసులు, నేషనల్ హైవే అధికారులు దౌర్జన్యంగా అక్రమ నిర్మాణాలు అంటూ మూడు జెసిబిలతో కూల్చడం దుర్మార్గమని తెలిపారు. అధికారుల చర్యలతో పేద ప్రజలు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలు దుకాణాలు, ఇళ్లను నిర్మించుకొన్నప్పుడు కళ్ళు అప్పగిస్తూ చూస్తూ నేడు నిర్దాక్షిణ్యంగా ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చడం సబబు కాదన్నారు. ఎక్కడా లేని అక్రమ నిర్మాణాలు కడప క్రాస్‌లో ఉన్నాయా అని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాల్లో బడా నాయకులు ఆక్రమించుకొన్న వారిని వదిలేసి పేదలపై పడడం దౌర్భాగ్యమన్నారు. కడప క్రాస్‌లో దాదాపుగా 92 దుకాలను తొలగించారన్నారు. ఇళ్లను, దుకాణాలను కూల్చడంతో రూ.2 కోట్లు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలపై రెవెన్యూ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడం దారుణమన్నారు. ఇదే చొరవ ప్రభుత్వ భూములు కబ్జాదారులపై చూపాలని తెలిపారు. తక్షణమే భవనాల తొలగింపును ఆపకపోతే బాధితులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి : గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ విసీ హాల్లో పలు అంశాలపై అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి బిఎల్‌ఒలు ఆరు రిజిస్టర్లు తప్ప నిర్వహించాలని, రికార్డులు పరిశీలించాలని తహశీల్దార్లను ఆదేశించారు. రీ సర్వేలో భాగంగా ఇకెవైసి పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయాలి అన్నారు. అలాగే పెండింగ్ లేకుండా భూహక్కు పత్రాలు త్వరగా రైతులకు పంపిణీ చేయాలన్నారు. దేవాదాయ శాఖకు సంబంధించిన భూములను రెవెన్యూ రికార్డ్‌లతో సరిపోల్చుకొని సంబంధిత మండల దేవాదాయ శాఖ అధికారులు, సంబంధిత తహశీల్దార్లను సంప్రదించి 22ఎ1సిలో కొత్తగా చేర్చడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తమ పరిధిలో ఉన్న దేవాలయ భూములకు సంబంధించి రికార్డులతో సహా పలు వివరాలను మండల ఎండోమెంట్ అధికారులు ఏ సమయంలోనైనా రికార్డులు ఇవ్వాలని సూచించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇంకా పట్టాలు ఇవ్వాల్సి ఉంటే తమ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి లేఅవుట్ సిద్ధం చేయాలన్నారు. జీరో నుంచి ఐదు సంవత్సరాలకు పిల్లల వివరాలను ఆధార్ అప్డేట్ చేయాలని, పెండింగ్ లేకుండా త్వరగా చూడాలని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ ఇకెవైసి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీలో పీలేరులో 276 పెండింగ్ ఉన్నాయని, త్వరగా ఆ పత్రాలు జారీ చేయాలని తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. మే, జూన్ మాసంలో ఉపాధి కూలీల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీని కలెక్టర్ ఆదేశించారు. ఇచ్చిన లక్ష్యాన్ని ప్రతి ఒక్క అధికారి అధిగమించాలన్నారు. హౌసింగ్‌లో ఇకెవైసి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఈనెల 9న జగనన్న చెబుదాం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తున్నారని," అధికారులందరూ హాజరు కావాలన్నారు. స్పందనలో రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపాలిటీలో అర్జీలు సంబంధించి అసంతృప్తితో ఎక్కువగా ఉన్నాయన్నారు సమీక్షలో డిఆర్‌ఒ సత్యనారాయణ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

సర్వే 90 శాతం పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో వచ్చే వారంలోపు ఎన్‌సిడి-సిడి సర్వే 90శాతం పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎన్‌సిడి-సిడి సర్వే, ఎఎన్‌ఎం ఫీడ్ బ్యాక్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, ఎఎన్‌ఎం నివారణ తదితర అంశాలపై వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఎన్‌ఎం, ఆశా, వైద్యాధికారి సమన్వయంతో ఎన్‌సిడి-సిడి సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ సోమవారానికి సరదు అంశంలో 80 శాతం ప్రగతి సాధించాలని గడవారం సూచించామని, అయితే కోనపేట, సాకిబండ, శెట్టిగుంట, టి.సుండుపల్లె, వీరబల్లి తదితర కొన్ని పిహెచ్‌సిలు సర్వే ప్రగతిలో ఇంకా వెనుకబడి ఉన్నాయన్నారు. ఇందుకు కారణాలను సంబంధిత పిహెచ్‌సి వైద్యాధికారి, ఆశా, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలను అడిగి తెలుసుకుని వచ్చే వారంలోగా లక్ష్యం మేరకు ప్రగతి సాధించాలన్నారు. సర్వే చేయడం, ప్రగతి సాధనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జీవనశైలిలో మారుతున్న ఆహార అలవాట్లతో వయస్సు నిండకముందే జబ్బులు చుట్టుముడుతున్నాయని, వ్యాధి ముదిరిపోయే వరకు గుర్తించకపోవడంతో ప్రాణాంతకంగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అసాంక్రమిక వ్యాధుల (ఎన్‌సిడి) కట్టడిలో భాగంగా సార్వత్రిక ఆరోగ్య పరీక్షల కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మధుమేహం, రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్(బిఎంఐ) సహా పలు రకాల సస్పెక్టెడ్ కేసులను, స్క్రీనింగ్ పరీక్షలు ఎఎన్‌ఎంలు ఇంటింటికి తిరిగి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆశా, ఎఎన్‌ఎంలు ప్రజలను సచివాలయానికి తీసుకొని వచ్చి" సర్వే పూర్తిచేయాలని, ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారులు స్వయంగా పర్యవేక్షించాలని తెలిపారు. వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా, ఎఎన్‌ఎం ఎన్‌సిడి స్క్రీనింగ్‌తో పాటు ప్రజలకు డిజిటల్ ఆరోగ్య ఐడీని కూడా ఆరోగ్య కార్యకర్తలు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆదేవిధంగా హెల్త్ ఐడి జనరేట్ చేయడంలో ప్రతివారం ప్రగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్‌ఒను కలెక్టర్ ఆదేశించారు. జీరో నుంచి ఆరు సంవత్సరాల పిల్లల వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ లో రక్తపోటు, మధుమేహం, సస్పెక్టెడ్ కేసులను గుర్తించి పరీక్షలు చేయాలన్నారు. వైద్యాధికారులు తరచూ హెల్త్ క్లినిక్ లను సందర్శించి ప్రభుత్వం నిర్దేశించిన మేరకు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలను పూర్తి చేయాలన్నారు. గతంలో గుర్తించి ఇప్పటికీ పరీక్షలు పెండింగ్‌లో ఉన్న రక్తపోటు, మధుమేహం, సస్పెక్టెడ్ కేసులకు వెంటనే పరీక్షలు పూర్తి చేయాలన్నారు. జిల్లాను రక్తహీనత లేని జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. గర్భిణులు, పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు తప్పనిసరిగా చేయాలన్నారు. ఇచ్చిన లక్ష్యాలను వందశాతం మేర పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ కొండయ్య, వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌లు, ఆశా, ఎఎన్‌ఎం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి : 'చింతల'



వాల్మీకిపురం: సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో వారి జీవన ప్రమాణం మెరుగవడంతో సుఖ సంతోషాలతో జీవిస్తున్నారన్నారు. సోమవారం వాల్మీకిపురం పంచాయతీ ప్యారంపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వివరాలు తెలియజేస్తూ సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సుఖ సంతోషాలే ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడం అద్భుతమైన నిర్ణయమన్నారు. ప్రతి సంక్షేమ పథకం పారదర్శకంగా లబ్ధిదారులకు అందుతోందన్నారు. అర్హతే ప్రామాణికంగా, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలను సిఎం జగన్ అందిస్తున్నారన్నారు. ఆదర్శంగా, పారదర్శకంగా రాష్ట్రంలో పాలన కొనసాగుతోందన్నారు. పేదలు, మహిళలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వాలంటీర్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, ఇఒ ఉదయ్ కుమార్, సర్పంచ్ గంగులమ్మ, నాయకులు నీళ్లభాస్కర్, కేశవరెడ్డి, అబ్దుల్ కలీమ్, రఘు, మహేష్, వెంకట్రమణ రెడ్డి, డివి రమణ, సైపుల్లా, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్ : అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడటం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యమని ఎమ్మెల్యే నవాజ్ బాషా అన్నారు. పట్టణంలోని 33వ వార్డులో పర్యటించారు. ప్రజల ముందుకు పాలన అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బి.వెంకటరమణ, శివయ్య, కరిముల్ల, శ్రీనివాసులు, మునిసిపల్ వైస్‌చైర్మన్ జింక వెంకట చలపతి, మునిసిపల్ కమిషనర్ ప్రమీల, స్థానిక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథిలు

ఘనంగా 'ఆదిత్య' కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదిగి, పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యలను సాధించవచ్చని ఎపిఎంఎస్ఐడిసి చైర్మన్ డాక్టర్ బి.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎపిఎంఎస్ఐడిసి చైర్మన్ డాక్టర్ బి.చంద్రశేఖర్ రెడ్డి, మిస్టర్ శ్రీరంగ కె.సుధాకర ఎమ్‌డి అండ్ ఫౌండర్ వ్యోమ మీడియా హాజరైయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో విలువైనదని చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత ఆశయాలు దిశలుగా అడుగులు వేయాలని, అనుకున్న లక్ష్యాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల తెలివితేటలను ఉపయోగించి వారి గమ్యస్థానాలను చేరాలన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, కళాశాల కరెస్పాండంట్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న విద్యార్థులకు ముఖ్య అతిధులు బహుతులు అందజేశారు. ప్రముఖ సింగర్ రేఖశ్రీ పాల్గొని ఆటపాటలతో అలరింప చేశారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎం.నాగమల్లారెడ్డిరెడ్డి, ఆర్.రవీంద్రారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు, కన్వీనర్ డాక్టర్ పి.సలీమా వివిధ విభాగధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలి

మదనపల్లె అర్బన్: ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలని, ప్రభుత్వ విద్య పట్ల ం చిన్నచూపు తగదని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు అన్నారు. స్థానిక నెహ్రూ పురపాలక సంగం పాఠశాలలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల ఫెడరేషన్ బాధ్యులకు అధ్యయన తరగతులలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్య పట్ల చిన్న చూసు చూపిస్తూ సకాలంలో పుస్తకాలు ఇవ్వకుండా, బోధనేతర కార్యక్ర మాలను తగ్గించకుండా ప్రతిగా టీచర్స్‌పై నెపం మోపడం, నోటీసులు, సస్పెన్షన్‌లతో వేధింపులకు గురిచేయడం సరైనది కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, సీనియర్ నాయకులు జి.సత్య నారాయణ, కె.సుబ్బారెడ్డి, సిహెచ్.రాజశేఖర్, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, కడప అధ్యక్ష, ప్రధాన కార్తదర్శులు ఎం.కిరణ్, కె.నాదముని, ఎస్.కె.బాబు, ఎస్.వెంకటముని, టి.వెంకటేశ్వరరెడ్డి, ఎస్.ఎం.డి.ఇలియాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

రాజంపేట అర్బన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి అన్నారు. పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సోమవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. జ్యోతిశ్రీ(514), స్పందన(514), హేమ ప్రియ(503) మార్కులు సాధించినందుకు పాఠశాల కమిటీ చైర్మన్ ఎస్.ఎం.డి కరీం విద్యార్థులను అభినందించి బహుమతులను అందజేశారు. రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ గుల్జార్‌బాషా విద్యార్థినులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి మాట్లాడుతూ విద్యార్థులు చదువు పట్ల ఆసక్తితో ఇష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులకు, పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ముజఫర్ అహ్మద్, బీరువాల రెహమాన్, మిల్లర్ కరీం, అబ్దుల్ రెహమాన్, పాఠశాల సిబ్బంది షాజహాన్, రాము పాల్గొన్నారు.

తేక్వాండో వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం

రాజంపేట అర్బన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోని ఇండోర్ స్టేడియంలో అన్నమయ్య తేక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని అకాడమీ సీనియర్ మాస్టర్ సగినాల పిచ్చయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు వయోపరిమితి లేకుండా ఏ వయసువారైనా శిక్షణ పొందవచ్చునని తెలిపారు. ఈ శిక్షణలో సీనియర్ విద్యార్థులకు త్వరలో జరగనున్న తేక్వాండో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ప్రతేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అథ్లెటిక్ కోచ్ పి.హరికృష్ణమరాజు, ఇన్‌స్పెక్టర్‌లు జాహిద్ అలీ, సగినాల రిజ్వాన్, సగినాల కుల్సుమ్, పాండు రంగా, జ్ఞాన సాయి పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పట్టణంలో ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో రోడ్లు వెడల్పు చేసేందుకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాన తపాలా కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు, పాత బస్టాండు నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు ఇరువైపులా పది అడుగుల మేర రోడ్లు వెడల్పు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. రూ 50.కోట్లు నిధులు అవసరమవుతాయని ప్రతిపాదనలు సిద్ధం చేసి ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాకే అమర్నాథ్‌రెడ్డితో చర్చించి ప్రత్తిపాదనలు ప్రభుత్వానికి పంపేందుకు రంగం సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. పట్టణంలో రోజురోజుకీ జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య ప్రధానంగా వేధిస్తోందన్నారు. ఈ సమస్యను నియంత్రించేందుకు మున్సిపల్ చైర్మన్ పాత బస్టాండు కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్‌లను ఏర్పాటు చేశారు. పట్టణంలో రోడ్లు వెడల్పు చేసేందుకు ముందడుగు వేయడం హర్షణీయమని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం.జనార్ధన్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ సాయిచరణ్‌కు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రి డాక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎన్.సాయిచరణ్‌ను కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఆర్.సురేష్ పూలమాల దుస్సాలువతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయిచరణ్ డాక్టర్ పట్టా సాధించడం ఆనందించదగ్గ విషయమన్నారు. యువత, విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. డాక్టర్ సాయిచరణ్ మాట్లాడుతూ అందరికీ వైద్య సేవలు అందించి మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి మంచి పేరు తెస్తానని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పాల రవికుమార్, డాక్టర్ రాధిక, యూత్ కరాటే క్లబ్ కార్యదర్శి, చీఫ్ ఇన్స్ట్రక్టర్ ఎం.మని సాయి, కరాటే మాస్టర్లు టి.మహేశ్వర్, షేక్ విశ్వా, జోషితరెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

వేసవి వినోదం కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి- రాయచోటి

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవిలో వినోదం శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి బాలాజీ నాయక్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని విజ్ఞాన్ హైస్కూల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి వినోదం కార్యక్రమాన్ని ఎంఇఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు వినోదంతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తూ పిల్లల్లో విజ్ఞాన్ని పెంపొంది సంతోషకరమన్నారు. ప్రతి విద్యార్థీ ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావ్ తన ప్రదర్శనతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. నోటిలో నుంచి లింగాలను తీయడం, ఖాళీ సంచి నుంచి కరెన్సీ నోట్లను తీయడం వంటి విన్యాసాలు ప్రదిశంచారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ మానవుల దగ్గర ఎటువంటి మంత్ర, తంత్రాలు ఉంవని, కేవలం జిమ్మిక్కులు మాత్రమేని పేర్కొన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు ఆంజనేయులు, రామయ్య, ప్రతాప్‌రెడ్డి, ఎపి.రెడ్డిప్పరెడ్డి, బయరెడ్డి, కళావతి శంకరయ్య, చక్రపాణి, రామక్రిష్ణ, శివారెడ్డి, ప్రకాష్ రెడ్డి రామ చంద్రారెడ్డి, రవీంద్రనాధరెడ్డి, బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

మహాయజ్ఞం మహోత్సవానికి కలెక్టర్‌కు ఆహ్వానం

రాయచోటి: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 12 నుంచి 17 వరకు నిర్వహించబోయే శ్రీలక్ష్మి మహాజ్ఞం మహోత్సవానికి రావాలని కలెక్టర్ గిరీషను జిల్లా దేవాదాయశాఖాధికారి పి.విశ్వనాథ్‌రెడ్డి ఆహ్వానించారు. సోమవారం కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పతంతో దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవాదాయశాఖ కమిషనరు రామ సత్యనారాయణ ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహిస్తామన్నారు. జిల్లా ప్రజలు కూడా పాల్గొన్నాలని తెలిపారు.

గడువులోగా అర్జీలను పరిష్కరించాలి

రాయచోటి: స్పందన ద్వారా అందిన ప్రతి ఆర్జీని గడువులోగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల విజ్ఞప్తులు కలెక్టర్ స్వీకరించారు. అర్జీల స్వీకరణలో డిఆర్‌ఒ సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి జయారాజ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించి వారి జీవితాల్లో వెలుగులు నింపే దిశగా ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన ప్రజల్లో బలమైన నమ్మకాన్ని కలుగజేయాలన్నారు. ఆర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం రాకపోయినా, నిర్దేశించిన గడువులోగా ఇవ్వకపోయినా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. స్పందన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చేయాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించి పారదర్శకంగా విచారణచేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు. కార్యక్రమంలో వివిధ జిల్లా శాఖ అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులు ఒత్తిడికి గురికావొద్దు

ప్రజాశక్తి-పీలేరు

గర్భిణులు ఒత్తిడికి గురికావద్దని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య తెలిపారు. సోమవారం పట్టణంలోని జివి నగర్‌లో గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య బృందం 'గర్భిణులు-మానసిక ఒత్తిడి ప్రభావం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం, ఆక్సిజన్, పోషక పదార్థాలు బిడ్డకు తల్లి ద్వారానే అందుతాయనేది ఎంత నిజమో, తల్లిచేసే ప్రతి ఆలోచన బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని చెప్పారు. తల్లి పడే మానసిక ఒత్తిడి బిడ్డపై పడుతుందని, కావున గర్భిణికి కుటుంబ సభ్యులు మానసిక చేయూత నివ్వాలని కోరారు. శారీరక పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహా మేరకు నివారణా చర్యల్లో భాగంగా మందులు, మాత్రలు వాడుకోవడం ఎంత అవసరమో, స్వీయ మానసిక ప్రశాంతత అలవర్చుకోవడం అంతే ముఖ్యమమి పేర్కొన్నారు. ఉదయం పూట తేలికపాటి వ్యాయామం, మంచి వ్యాపకాలు, జ్ఞాపకాలు, బలాన్నిచ్చే పౌష్టికాహారం, పగటిపూట రెండు గంటల విశ్రాంతి, ఎనిమిది గంటల నిద్ర, మొదలగు మేలైన నిర్ణయాలతో మానసిక ఆరోగ్యం తల్లి స్వంతమని పేర్కొన్నారు. వడదెబ్బ నుండి తనను తాను ఎలా రక్షించుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ వెంకట సుబ్బమ్మ, పర్యవేక్షకులు కృష్ణయ్య, ఎఎన్‌ఎం లక్ష్మీదేవి, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.



గర్భిణులకు ఆరోగ్య సలహాలిస్తున్న ఎడ్యుకేటర్ కొండయ్య

ముస్లిములపై కపట ప్రేమ : టిడిపి

ప్రజాశక్తి - రాయచోటి

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిములపై కపట ప్రేమ చూపుతున్నాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి హాజ్ యాత్రికులను తీవ్ర నిరాశకు గురిచేశారని చెప్పారు. ఎన్నడూ లేని విధంగా ఎపి నుంచి హజ్ యాత్రకు వెళ్లే ముస్లిములకు రూ.83 వేలు అదనపు విమాన ఛార్జిలు విధించడం దారుణమని వాపోయారు. ఇది కేవలం రాష్ట్ర ప్రభుత్వ చేతకాని, నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని చెప్పారు. హైదరాబాద్ విమానాశ్రయం నుంచి విజయవాడ విమానాశ్రయానికి 250 కిలో మీటర్లు దూరం ఉందని, ఈ నెపంతో రూ. 83 వేలు అదనంగా ఛార్జి వేయాల్సిన పరిస్థితిని హాజ్‌యాత్రికులు జీర్ణించుకోలేకపోతున్నారని వాపోయారు. విజయవాడ విమానాశ్రయం నుండి జిద్దాకు (మక్కా) నేరుగా వెళ్ళే సదుపాయాన్ని నాడు టిడిపి ప్రభుత్వం హయాంలో కల్పించారని చెప్పారు. హజ్ యత్రికుల సౌలభ్యం కోసం విజయవాడలో హజ్ హౌస్ నిర్మాణం కోసం చంద్రబ్బానాయుడు శంకుస్థాపన చేసి నాటి టీడీపి ప్రభుత్వ హయాంలో రూ. 35 లక్షలు మొదటి విడతలో విడుదల చేయగా వైసిపి ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం దారుణమని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హాజ్‌యాత్రికులపై అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోవు ఎన్నికల్లో ముస్లిములు తప్పక గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి మైనార్టీ నాయకులు అబూజర్, ఇమామ్, దస్తగీర్, మస్తాన్, జావేద్, హుస్సేన్, చోటు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాజుల ఖాదర్‌బాషా


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి- కలకడ

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహాలు పాటించాలని డాక్టర్ ఎంవి.కిషోర్‌కుమార్ తెలిపారు. సోమవారం ఎపిఎంఒ పరుశురాం అధ్యక్షతన మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూడో విడత వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు డాక్టర్ఎం.వి.కిషోర్ కుమార్‌రెడ్డి. డాక్టర్ పి.జవహర్ బాబు ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఒకటి, రెండు విడతలలో అత్యధిక శాతం కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. యాభై సంవత్సరాలు పైబడిన వారందరూ కంటిచూపు లోపం వస్తుందని అసంక్రమమైన వ్యాధుల వల్ల కంటి చూపు లోపిస్తుందని అన్నారు. ఎపిఎంఒ పరశురాం మాట్లాడుతూ ప్రతి సచివాల యాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అందరికీ మూడో విడత కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ జయ రామయ్య, పిహెచ్ఎన్ సుబ్బ రత్నమ్మ, సూపర్వైజర్ ముజీబ్ బాషా, ల్యాబ్ టెక్నీషియన్ జమీల్అహ్మద్, ఆరోగ్యకార్యకర్త వాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన ఆర్యమాంబ జాతర

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని డి. రాచపల్లి పంచాయతీ లో వెలిసిన ఆర్యమాంబ జాతర సోమవారం ఘనంగా ముగిసింది. ఆలయ పూజారులు అమ్మవారికి పలు అభిషేకాలు నిర్వహించారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో భక్తులు చాందినీ బండ్ల ప్రదర్శన చేశారు. కోలాటాలు, చెక్కభజనలు తదితర ప్రదర్శనలతో నిండు తిరుణాల కోలాహలంగా జరిగింది. సోమవారం వేకువజామునే గ్రామంలోని మహిళలందరూ అమ్మవారికి మూకుమ్మడిగా బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ప్రశాంతంగా జరిగేందుకు ఎస్ఐ రహీముల్లా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు, సీనియర్ నాయకులు జగన్‌మోహన్‌రాజు, కేశవరాజు, వెంకట రామరాజు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి కొల్లి కటరమణ నాయుడు, సుధాకర్‌రాజు, ప్రసాద్‌రాజు, సురేష్, పవన్,హరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లె ఎపి మోడల్ స్కూల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రేఖ తెలిపారు. ఐదో తరగతి తెలుగు, ఇంగ్లీష్ మీడియాలలో పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి, మైనారిటీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈనెల 9 నుంచి 25వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, పూర్తి చేసిన దరఖాస్తులను పాఠశాలలో ఇవ్వాలని సూచించారు. జూన్ 11వ తేదీన రాత పరీక్ష ఉంటుందని, ఈ పరీక్షలో పాసైన విద్యార్థుల ప్రతిభను బట్టి అడ్మిషన్ చేసుకుంటామని తెలిపారు.

ఆర్చీని ప్రారంభించిన 'గడికోట'

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని ఎర్రంరెడ్డిగారిపల్లి క్రాస్ వద్ద రూ.30 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్చీని సోమవారం మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ప్రారంభించారు. సుద్దమాల్ల పంచాయతీ, యర్రాంరెడ్డిగారిపల్లి క్రాస్ వద్ద దర్గా స్వామిజీ, నారాయణస్వామి టెంపుల్ నిధులతో సుమారు రూ.30లక్షల వ్యయంతో అర్చీని నిర్మిచారు.ఆయన మాట్లాడుతూ అర్చీని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అర్చీని నిర్మించిన నారాయణస్వామి, ఆలయ ధర్మకర్త సీతారాంరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్‌చైర్మన్ కర్ణపు విశ్వనాధరెడ్డి, వైసిపి రాష్ట్ర యువజన విభాగ జనరల్ సెక్ర టరీ సూరం వెంకటసుబ్బరెడ్డి, చిన్నరెడ్డి, కుండా వెంకటేశ్వర, శ్రీకాంత్‌రెడ్డి, వేణు గోపాల్‌రెడ్డి, గంగిరెడ్డి, చలమారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేష్, రమణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట


ఆర్థిక సాయం అందిస్తున్న వైసిపి నాయకులు

భర్తను కోల్పోయి అనాథగా మిగిలిన కుటుంబానికి ఎమ్మెల్యే, ఎంపీ సహకారంతో ఆర్థిక సాయం అందించినట్లు వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లా డుతూ మండలంలోని నాయనిబావి గ్రామపంచాయతీ,పట్రవారి పల్లికి చెందిన గుర్రప్పగారి శివశంకర్ ఇటీవల మృతి చెందాడు. తమ కుటుంబ పోషణ భారంగా మారిందని మృతుడి భార్య స్థానిక వైసిపి నాయకులకు తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారక నాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఈ విషయంపై సత్వరమే స్పందించిన వారు ఆ కుటుంబానికి రూ.50 వేల అందజేయాలని ఆదేశించారు. స్థానిక ఎంపిటిసి రామసుబ్బారెడ్డి, ఆకులవారిపల్లి గడ్డం మురళిరెడ్డి, ఆకులవారిపల్లి నరసింహారెడ్డి, నాయన బావి భూషణ్ రెడ్డిల చేతుల మీదుగా పట్రవారిపల్లెలోని మృతుని భార్య జి.లలిత, పిల్లలకు అందించారు.

కనుల పండువగా రాములోరి కల్యాణం

ప్రజాశకి-చిన్నమండెం


కల్యాణాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

మండలంలోన వండాడి గ్రామం కదిరివాండ్లపల్లెలో కోదండ రామ స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవం బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమ వారం కోదండ రామ స్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వ హించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జడ్‌పి మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డి, ఎంపిపి సుధామాధురిలు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రంగారెడ్డి, సర్పంచ్ ముసల్ రెడ్డి, ఎంపిటిసి శ్యామ్, చంద్రారెడ్డి, భూషణ్‌రెడ్డి, మోహన్ రెడ్డి, ధనుష్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను సురక్షితంగా రప్పించాలి

మదనపల్లె అర్బన్ : మణిపూర్‌లోని ఇంఫాల్‌లో క్కుకున్న తెలుగు విద్యార్థులను సురక్షితంగా ఇంటికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పూరి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మణిపూర్లోని ఇంఫాల్‌లో చెలరేగిన హింస అక్కడ చదువుతున్న ఎపి విద్యార్థులను ప్రమాదంలో పడేసిందన్నారు. ఇంఫాల్‌లోని సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్శిటీ, ఎన్ఐటీలలో సుమారు 100 మందికిపైగా తెలుగు విద్యార్థులు చదువుతున్నారని, అక్కడి పరిస్థితుల కారణంగా తెలుగు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భద్రతపై ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో తెలుగు విద్యార్థులను సురక్షితంగా ఇంటికి తిరిగి రావడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. భారత ప్రభుత్వంతో, అక్కడి స్థానిక అధికారులతో మాట్లాడి విద్యార్థులను సురక్షిత మార్గంలో ఇంటికి చేర్చడానికి చర్యలుతీసుకోవాలన్నారు. ఇంఫాల్ నుండి ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులను తరలించాలని, విద్యార్థులు ఇంటికి తిరిగి తీసుకువచ్చే వరకు వారి సంరక్షణ, సౌకర్యం కోసం ఆహారం, నీరు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులను క్షేమంగా తీసుకువస్తామని అని వారి తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట


తంబళ్లపల్లి : పుస్తక పఠనంలో విద్యార్థులు

పట్టణంలోని గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జరుగనున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ శాఖ అధికారి ఎం.తులసినాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు నైనార్ మధుబాల ఆదేశాల మేరకు జూన్ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ అంశాలపై విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ ఉచిత శిక్షణాశిబిరం ద్వారా పిల్లలు గ్రంథాలయాలకు వచ్చేలా చూడటం, పిల్లల్లో పుస్తక పఠనంతోపాటు విజ్ఞానాన్ని పెంపొందిచడం, వారిలో సృజనాత్మకతను వెలికి తీయడం, పిల్లలకు కథలు చెప్పడం, చెప్పించడం, పుస్తక సమీక్షలు, స్పోకెన్ఇంగ్లీషు, చిత్రలేఖనం, థియేటర్‌ఆర్ట్, అల్లికలు (పేపర్ క్రాఫ్టింగ్) పద్యాలు నుంచి అముద్రిత కథలు చెప్పటం, తెలుగు వ్యాకరణం తదితర అంశాలలో వారికి శిక్షణ ఇప్పించి ప్రతి వారం ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్నామన్నారు. మొదటి రోజు 42 మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. **కలకడ :** మండల కేంద్రమైన కలకడ గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఘనంగా ప్రారంభించారు. సోమవారం మండల కేంద్రమైన కలకడ గ్రంథాలయ శాఖ అధికారి అమరనాథ ఆధ్వర్యంలో పుస్తక పఠనం కార్యక్రమం ప్రారంభించారు. పుస్తకాలు చదవడం, కథలు చదివి వినిపించడం, నీతి పద్యాలు చదివించడం, క్యారం బోర్డు, చెస్ వంటి ఆటలు ఆడించడం జరిగిందన్నారు. మొదటి రోజు దిగ్విజయంగా సమ్మర్ క్యాంపు కొనసాగిందని, 26 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **వాల్మీకిపురం :** ఈ నెల 8 నుంచి జూన్ 11వ తేది వరకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారి రమాపతి తెలిపారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం, కథలు, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, డ్యాన్స్, క్రాఫ్ట్ కట్టింగ్, సింగింగ్, రీడింగ్, రైటింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, ఆటల పోటీలు, తదితర సృజనాత్మక కార్యక్రమాలను ప్రతి రోజు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం శ్రీదేవి విద్యార్థులకు ఉపయోగపడే ఎంసెట్, మెడిసిన్, నీట్ పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. **కలికిరి :** స్థానిక గ్రంథాలయ అధికారి బి.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం ఘనంగా ప్రారంభించారు. మండల ఇఒఆర్‌డి అబ్దుల్ కలామ్ ఆజాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులందరూ వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని సృజనాత్మకతను అభివృద్ధి పరచుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిబ్బంది రెడ్డప్ప, విద్యార్థులు పాల్గొని వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. **కురబలకోట :** వేసవి శిక్షణా తరగతులను పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి దస్తగిరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు జూన్ 11 వ తేదీ వరకు జరిగే వేసవి శిక్షణా తరగతుల వల్ల చిన్న పిల్లలకు జ్ఞానోదయం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి బైసాన జ్యోతి చంద్రశేఖర్‌రెడ్డి , ఎండిఒ దిలీప్ కుమార్, సర్పంచ్ సుజాత, ఉపసర్పంచ్ రాజశేఖర్ గ్రంధాల అధికారి బి.చంద్రశేఖర్, నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** స్థానిక గొల్లపల్లి క్రాస్ నందు గల శాఖ గ్రంథాలయంలో సంస్థ అధ్యక్షులు నైనరు మధుబాల ఆదేశాలతో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభమైనట్లు శాఖ గ్రంధా లయ అధికారి ఆర్.వసంతకుమారి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ముఖ్య అతిథి పాలిటెక్నిక్ కాలేజ్ లైబ్రేరియన్ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ సంస్థ అందిస్తున్న సేవలను గూర్చి వివరించి హాజరైన విద్యార్థులలో ఆసక్తిగల 34 మంది విద్యార్థులకు తమ స్వంత ధనంతో గ్రంథాలయంలో సభ్యత్వాలను ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో విశ్రాంత మున్సిపల్ కమిషనర్ సహదేవరావు, వార్డు కౌన్సిలర్ సుధాకర్, ఉపాధ్యాయుని విజయలక్ష్మి, కథ నవలా రచయిత, సాహిత్య విమర్శకులు టిఎస్.ఎ.కృష్ణమూర్తి, అపెక్స్, ప్రజా చైతన్య స్రవంతి అధ్యక్షులు డాక్టర్ గొల్లపూడి తిరపతిరావు, బిడిసి వర్కర్ రమణమ్మ పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** స్థానిక తంబళ్లపల్లి మండలంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పర్సన్ శ్రీమతి నైనారు మధుబాల ఆదేశాల మేరకు కార్యదర్శి ఆదేశాల మేరకు సోమవారం నుండి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం భాగంగా సుమారు 20 మంది విద్యార్థుల పాల్గొని దినపత్రికలు చదివి నీతి కథలు చదవడం మరియు క్యారమ్స్, చెక్స్ ఆటలు ఆడారు.


లక్ష్మి అక్షయను సన్మానిస్తున్న సంఘం అధ్యక్షులు

ప్రతిభకు పట్టాభిషేకం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలో ఇటీవల విడుదలైన పదవతరగతి పరీక్షా ఫలితాలలో ఎపి మోడల్ స్కూల్ కు చెందిన విద్యార్థిని లక్ష్మీ అక్షయ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థినిని ప్రోత్సహిస్తూ సంఘ అధ్యక్షుడు సుబ్బనరసారెడ్డి అధ్యక్షతన మోడల్ కళాశాల ప్రిన్సిపల్ లీలాశ్రీహరి చేతుల మీదుగా విద్యార్థిని తల్లిదండ్రుల సమక్షంలో ప్రోత్సాహబహుమతి రూ.1116 షీల్డ్, దుశ్శాలువాతో సత్కరించారు. ప్రిన్సిపల్ లీలాశ్రీహరి మాట్లాడుతూ మా కళాశాల నుంచి పదవ తరగతి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు మండల స్థాయిలో సాధించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వాహిద్, కోశాధికారి నరసిం హులు, సభ్యుడు జ్యోతీశ్వర్ నాయుడు, సంఘ వాలంటీర్ మరళీ, మునెమ్మ, లీలాకృష్ణయ్య, ఆనంద్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సత్తా చాటిన విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-గాలివీడు


విద్యార్థులకు కేక్ తినిపిస్తున్న ఉపాధ్యాయులు

పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు 500 మార్కులకు పైన 12 మంది విద్యార్థులను కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ఇంటర్, ఉన్నత విద్యలో కూడా ఎటువంటి ప్రతిభతో మంచి ఉన్నత స్థాయిలో ఎదగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ కుండా లక్ష్మీప్రసన్న, పిఇటి కరుణాకర్, ఉపాధ్యా యుడు భాస్కర్, విద్యార్థులు నస్రిన్, పద్మప్రియ, ఈశ్వరమ్మ సిద్ధిగా హర్షిత, మిస్బా ఫాతిమా, శ్రావణి, సుచరిత, ఆయేషా, లేకియా, శైలజ విద్యార్థినిలతో అభినందనలు తెలిపారు.

విజయభారతి విద్యార్థుల విజయం అద్వితీయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని సొసైటీ కాలనీలోని విజయభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు సాధించిన విజయం అద్వితీయమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నాయ కులు షాజహాన్ బాషా కితాబునిచ్చారు. సోమవారం పాఠశాల ఆవరణంలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతి రెడ్డి 595, పెద్ద పాళ్యం దివ్యసాయి 593, భువనశ్రీ 591, రోషిణి సుహైలా 590 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకులు చేసుకోవడం హర్షిణీ యమ న్నారు. అదేవిధంగా మొత్తం 70 మంది విద్యార్థులు 500 సాధిం చడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఇంతటి అమోఘమైన ఫలితాలతో మదనపల్లె నియోజకవర్గం ప్రతిష్టను రాష్ట్రవ్యాప్తం చేసిన కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు, రెడ్డిరాణి ఉపాధ్యాయులు, విద్యార్థులపై ప్రశంసల వర్షం కురిపించారు. కార్యక్రమంలో చల్లపల్లె నరసిం హారెడ్డి, డాక్టర్ అజ్మతు ల్లాఖాన్, టిడిపి నాయకులు షంషీర్, నాగూర్ వల్లి, రఘునాథ్, గిరీష్ కుమార్, బండి అమర, సీడ్ మల్లికార్జున నాయుడు పాల్గొన్నారు.

గాలివీటమ్మకు బంగారుదండ బహూకరణ

ప్రజాశక్తి-గాలివీడు

మండలకేంద్రంలోని పవిత్ర కుషావతి నదీ తీరాన వెలసిన గాలివీటి గంగమ్మకు రూ.1.50 లక్షలు విలువ చేసే బంగారు కాసుల దండను అదే గ్రామానికి చెందిన పక్కిరెడ్డి గారిపల్లె వాస్తవ్యులు వన్నేటి రవీంద్ర కుటుంబ సభ్యులు బహూకరించారు. సోమవారం వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ నిర్వాహకులకు బంగారు అభారణాన్ని అంద జేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వారి తల్లిదండ్రులైన పూజారి వెంకట్రామయ్య, లక్ష్మమ్మ, సోదరుడు చంద్రయ్య జ్ఞాపకార్థం బంగారు దండను అందదించినట్లు గత కొన్ని సంవత్సరాలుగా గాలివీటమ్మకు అర్చకత్వం వహిస్తూ వస్తున్న తమ కుటుంబ సభ్యులకు ఆ తల్లి ఆశీస్సులు మెండుగా వున్నాయని వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోపి కృష్ణారెడ్డి,నరసారెడ్డి,రణదీప్ పాల్గొన్నారు.


బంగారు దండ బహూకరిస్తున్న పన్నేటి రవీంద్ర

అభివృద్ధి చేశాం..ఆదరించండి

- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి


ప్రజలకు అభివాదం చేస్తున్న కిషోర్ కుమార్ రెడ్డి

మండలాన్ని ఎంతో అభివృద్ధి చేశామని వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించి ఆదరించాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కోరారు. సోమవార ఇంటింటికి నల్లారి కార్యక్రమాన్ని కలికిరి నుంచి ప్రారంభించారు. పట్టణంలోని మసీదువీధి, టీబీరోడ్డు నుంచి క్రాస్‌రోడ్డు వరకు ఇంటింటికి వెళ్లి గతంలో నల్లారి కుటుంబం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వారికి తెలియజేస్తూ ఇప్పుడున్న వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు జరుగుతున్న నష్టాలు గురించి వారికి వివరించారు. గత ప్రభుత్వంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవనం కొనసాగించే వారిని అదే ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నిత్యవసర ధరలు పెరిగి రైతులకు గిట్టుబాటు ధరలు లేక, ప్రభుత్వ ఉద్యోగులు సైతం అన్ని వర్గాల వారు ఈ ప్రభుత్వం పై విసుగు చెందుతున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే వైయస్సార్సీపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపి టిడిపిని అధికారంలోకి తీసుకురావాలని వారికి తెలిపారు. పీలేరు నియోజకవర్గంలో టిడిపిని బలపరచి గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కలికిరి మేజర్ పంచాయతీ సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్ కుమార్‌రెడ్డి, ముస్లిం మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్ఐ హనీఫ్, నాయకులు నల్లారి చంద్రరెడ్డి, నల్లారి లక్ష్మీకర్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి రహంతుల్లా, మాలతి, పులి సత్యరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సహదేవరెడ్డి, మైనార్టీ నాయకులు వైజాగ్ భాషా, సనావుల్లా పాల్గొన్నారు.


రూ.5 లక్షల చెక్కును అందిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

దేవాలయానికి రూ.5 లక్షల విరాళం

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండల పరిధిలోని బొమ్మవరం గ్రామంలో స్వయంభు వెలసిన శ్రీ పార్వతి పరమేశ్వర దేవాలయానికి సోమవారం ముక్కా ఫౌండేషన్ అధినేత ముక్కారూపానందరెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కా సాయి వికాస్ రెడ్డి గ్రామస్తులకు రూ.5లక్షల చెక్కును విరాళంగా అందించారు. ఫౌండేషన్ అధినేత మాట్లాడుతూ పార్వతీ పరమేశ్వర దేవాలయానికి ఐదు లక్షల విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ముక్కా ఫౌండేషన్ ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం, దేవాలయాలకు విరాళం అందజేయడం, అనారోగ్యులకు ఆర్థిక సాయం అందించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో గూడూరు గౌరీశంకర్‌రాజు, మండల ఉపాధ్యక్షుడు సర్పంచ్ గంగురాజు, రమేష్, చంగల్ రాజు, కుమార్‌రాజు, శివకోటి నాగేంద్రరాజు , సురేష్ రాజు, శంకర్ రాజు గూడూరు చంగల్ రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి పిల్లవాడిని బడిలో చేర్పిస్తాం

పుల్లంపేట : మండల పరిధిలోని బావికాడపల్లి జగనన్న ఎస్‌టి కాలనీ సోమవారం ఎంఇఒ రంగనాథయ్య తనిఖీ చేశారు. ఎస్‌టి కమిషన్ సభ్యులు వైవిధ్య శంకర్ నాయక్ ఆదేశాల మేరకు స్కూలుకు వెళ్ళని పనిచేస్తున్న ప్రతి పిల్లవాడిని స్కూల్లో చేర్పించడానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ఆధార్‌కార్డ్ లేని ప్రతి పిల్లవాడికి ఆధార్ కార్డు తీయించి అంగన్వాడీ స్కూల్లో, ఆరు సంవత్సరాలు ఉన్న పిల్లవాడిని ప్రాథమిక పాఠశాలను చేర్పించడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. గ్రామంలో పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరిని కచ్చితంగా స్కూల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు ఎంఇఒ సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాంబశివరావు, శాంతకు మారి, సిఆర్‌పిలు లక్ష్మీదేవి, పంచాయతీ సెక్రెటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

'యూస్ గేమ్స్'లో ప్రతిభ చాటిన దరిహాస్

ప్రజాశక్తి-రామాపురం

గోవాలో జరుగుతున్న యూస్ గేమ్స్ కౌన్సిల్ ఇండియా ఇంటర్నేషనల్ యూత్ గేమ్స్ రన్నింగ్ లో ప్రథమ స్థానం సాధించిన బలిశెట్టి దరియాస్ మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ, కొత్తపల్లికి చెందిన రవితేజ కుమారుడు కడప లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో 5వ తరగతి చదువుతున్నాడు గోవాలో జరుగుతున్న కౌన్సిల్ ఇండియా ఇంటర్నేషనల్ పోటీలలో రన్నింగ్ అండర్ 11 విన్నరుగా నిలిచారు. చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో విన్నర్‌గా నిలిచిన దరిహాస్, రవితేజను పలువురు అభినందించారు.


రక్తదానం చేస్తున్న యువత

చిన్నారుల కోసం రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-ములకలచెరువు

ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా బ్లాసామ్ డిగ్రీ కళాశాలలో హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో సోమవారం తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని డాక్టర్ పి.వి.రమణ, డాక్టర్ రాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ 27 ప్రాంతాల్లో నిస్వార్థపు సేవలు అందిస్తున్నామని చెప్పారు. తమ సంస్థ సేవలను విస్తృతం చేస్తూ 28 శాఖగా ములకలచెరువు ఇన్‌ఛార్జిగా భాధత్యలు చేపట్టిన ముస్తఫాపఠాన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసేమియా చిన్నారుల రక్త అవసరాలను దృష్టిలో ఉంచుకుని రక్తదాన శిబిరాన్ని నిర్వహించి ననట్లు తెలిపారు. తలసేమియా వ్యాధితో ఉన్న చిన్నారులకు 20 రోజులకు ఒకసారి రక్తం అవసరం ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు అవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్లాసామ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మహబూబ్ బాషా, అధ్యాపక బృందం, హెల్పింగ్ మైండ్స్ సభ్యులు తమిజుల్ రెహ్మాన్, విష్ణువర్ధన్, మస్తాన్, జోయ, షాబాజ్, ఇస్మాయిల్, మదనపల్లి వాలంటరీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ రక్తదాన శిబిరంలో 32 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్టు తెలిపారు.

క్రైం కార్నర్


హత్యకు గురైన యువకుడు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి

యువకుడి దారుణ హత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఓ యువకుడు దారుణహత్యకు గురైన సంఘటన సోమవారం మండలం లోని చీకలబైలు పంచాయతీలో చోటు చేసుకుంది. మదనపల్లి రూరల్ సిఐ సత్యనారాయణ కథనం మేరకు వివరాలు... మదనపల్లె పట్టణం నక్కలదిన్నెకు చెందిన వెల్డింగ్ షాపు నిర్వహకుడు ఖాదర్‌వలీ, అతని వద్ద వర్కర్‌గా పనిచేస్తున్న పఠాన్‌అక్రమ్(24), కాలనీగేట్‌కు చెందిన రెడ్డిబాష, నక్కలదిన్నె వాటర్ లైన్‌మెన్ సుధాకర్, చిప్పిలికి చెందిన ఆటో డ్రైవర్ వీరప్రసాద్ మరో వ్యక్తి కలసి ఆదివారం సాయంత్రం ఆటోలో కర్నాటక రాష్ట్రం రాయల్పాడు స్వంత పనులపై వెళ్లారని చెప్పారు. తిరిగి వస్తుండగా కర్నాటక-ఆంధ్ర సరిహద్దులోని పెట్రోల్ బంకువద్ద ముందుగా వచ్చిన ఆటో డీజిల్ పట్టుకుని అందుకు సంబంధించిన బిల్లు అడిగారు. పెట్రోల్ బంకు వర్కర్ ఇవ్వక పోవడంతో వెనుక నుంచి వచ్చిన కడప జిల్లాకు చెందిన కారులో ముగ్గురు వ్యక్తులు ఆటో డ్రైవరుపై దురుసుగా ప్రవర్తించారు. అయితే ముందుగా వచ్చిన కారు చీకలబైలు ప్రాంతంలో వెనుక నుంచి వచ్చిన ఆటోను అడ్డుకున్న కారులో ముగ్గురు యువకులు దాడి చేయడంతో ఆటోలో ఉన్న అక్రమ్ అక్కడి నుంచీ పరారైయ్యాడు. నడుచుకుంటూ మదనపల్లె వైపు వస్తున్న అక్రమ్‌ను బార్లపల్లి సమీపంలోని మర్రిమాను వద్ద కారులోని ముగ్గురు అడ్డుకుని దాడిచేసి హత్యచేసి రోడ్డు ప్రక్కన పడేసి వెళ్ళిపోయారని తెలిపారు. సోమవారం ఉదయం గమనించిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని డిఎస్‌పి కేశప్ప, సిఐలు సత్యనారాయణ, మురళీకృష్ణ, ఎస్ఐలు సుధాకర్, హరిహరప్రసాద్‌లు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసునమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

రామపురం : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన మండలంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు మండలంలోని ఉడుంవారిపల్లె నుంచి కడపకు మామిడికాయలు లోడుతో సోమవారం తెల్లవారు జామున బయలుదేరిన ఆటో రామపురం రాగానే వెనుక వైపు నుంచి వచ్చిన వాహనం ఢీకొనడంతో ఆటో బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. మామిడికాయలు రోడ్డు పాలు కావడంతో రైతు తీవ్రంగా నష్టపోయాడని అన్నారు. గాయపడిన డ్రైవర్ ఇషాద్‌ను కడప రిమ్స్ తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నలుగురు నాటుసారా నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అక్రమంగా సాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు టూటౌన్ సిఐ ఎస్.మురళీకృష్ణ తెలిపారు. సోమవారం తమకు రాబడిన సమాచారం మేరకు పట్టణంలోని చౌడేశ్వరిదేవి గుడికి సమీపంలో మడక నాగరాజు అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఐదు లీటర్ల అక్రమ నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గౌతమి నగర్‌కు చెందిన డి.చలపతి అనే వ్యక్తి టమోటా మార్కెట్ సమీపంలో కుండల అంగడిలో అక్రమమద్యాన్ని విక్రయిస్తుండగా అతని వద్ద పది బాటిళ్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో టూ టౌన్ ఎస్ఐ లోకేష్‌రెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** నాటు సారాను విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు బండ్లపైకు చెందిన మోహన్‌కుమార్ నాటుసారాను అక్రమంగా రవాణా చేస్తూ, విక్రయిస్తుండటంపై పోలీసులు నిఘా ఉంచినట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం బండ్లపై గ్రామ సమీపంలోని చింత చెట్టు వద్ద నాటు సారాను విక్రయిస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించి అతనిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి అయిదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. నాటుసారా తయారీ, విక్రయానికి పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి, జైలుకు పంపడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు. **ములకలచెరువు :** 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. మండలంలోని గూడుపల్లె పంచాయతీ కోట పల్లెలో మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో రాజారెడ్డి అనే వ్యక్తి నుంచి 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గంగమ్మ ఊరేగింపులో ఘర్షణ : కేసు నమోదు

కలకడ : ఇరువర్గాలు ఘర్షణ పడగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని దిగుతాండ గ్రామంలో జరిగిన అనంతపురం గంగమ్మ టెంపుల్ ఊరేగింపు సందర్భంగా ఆ గ్రామానికి చెందిన మూడే హరిప్రసాద్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హరిప్రసాద్ నాయక్, ప్రేమ్ కుమార్ నాయక్ అనే అతనిని గుర్రంకొండ మండలం మర్రిపాడు గ్రామము సింగంవారిపల్లి గ్రామానికి చెందిన రాఘవేంద్రనాయక్, నరేష్‌నాయక్, అనిల్ నాయక్, సంజీవనాయక్, శివనాయక్, శ్రీనివాసనాయక్, గజేంద్రనాయక్, శశిబాయ్ అనే వారు దాడి చేసి గాయపరిచారని ఫిర్యాదు చేశారని తెలిపారు. గుర్రంకొండ మండలం మర్రిపాడు గ్రామం, సింగంవారిపల్లి గ్రామానికి చెందిన రాజేందర్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేందర్ నాయక్, అతని కుటుంబ సభ్యులను దిగుతాండ గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్, పతి, గణపతి, మిఠాయి, రమేష్‌నాయక్, నటరాజ్‌నాయక్ అనేవారు చేతులతో కొట్టి మోటార్ సైకిల్లో అడ్డగించినట్టు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.